AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


9-1-2026 (friday) MAIN EDITION

## బలపడిన వాయుగుండం.. తుపాన్ ముప్పు



**అక్షరటుడే, హైదరాబాద్ :** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడింది. ఇది తుపాన్‌గా మారనున్నట్లు వాతావారణ శాఖ అధికారులు హెచ్చరించారు. బంగాళాఖాతం నైరుతి ప్రాంతంలో ఈ నెల 5న ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అది బలపడి వాయుగుండంగా మారింది. ప్రస్తుతం శ్రీలంకలోని హంబన్‌టోటాకు 410, చెన్నైకి నైరుతి దిశగా 980 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. పశ్చిమవాయువ్య దిశగా శ్రీలంక వైపు కదులుతోంది. శుక్రవారం తీవ్ర వాయుగుండం తుపాన్‌గా మారే అవకాశం ఉందని ఐఎండీ అధికారులు అంచనా వేశారు.

## ఇరాన్‌లో కొనసాగుతున్న నిరసనలు.. 45 మంది మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** నిరసనలతో ఇరాన్ అట్టుడుకుతోంది. 46 నగరాలు, 21 ప్రావిన్సులలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇరాన్ సుప్రీంనేత ఖమేనీకి వ్యతిరేకంగా ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. డిసెంబర్ 28న టెహ్రాన్ బజార్‌లో మూసివేతతో ప్రారంభమైన ఇరాన్ నిరసనలు తీవ్ర రూపం దాల్చాయి. పతనమవుతున్న ఆర్థిక వ్యవస్థకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారాయి. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ క్షీణించడం, రియాద్ విలువ పడిపోవడంతో రెండు వారాల పాటు ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు.

## టికెట్ రేట్ల పెంపుపై హైకోర్టు ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్:** సినిమా టికెట్ల రేట్లు పెంపుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పదే పదే రేట్లు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించింది. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. టికెట్ రేట్లు పెంచబోమని మంత్రి కూడా చెప్పారని, అయినా పెంపునకు అనుమతిస్తూ ఎందుకు మెమోలు ఇస్తున్నారని ప్రశ్నించింది.

## శబరిమల ఆలయ పూజారి అరెస్ట్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** శబరిమల బంగారం తాపడాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. శబరిమల తంత్రి (ప్రధాన పూజారి) కందరారు రాజీవరును సిట్ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## నష్టపోయిన మార్కెట్లు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో మార్కెట్‌లో అస్థిరత నెలకొంది. ఫారిన్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు ఉపసంహరిస్తుండడం, రిటైల్ ఇన్వెస్టర్లు ఆందోళనతో అమ్మకాలకు పాల్పడుతుండడంతో మార్కెట్‌పై ఒత్తిడి తీవ్రంగా ఉంది. దీంతో శుక్రవారం సైతం మార్కెట్ నష్టాల్లోనే ముగిసింది.




## పొగమంచులో సాహసం వద్దు : సీపీ సజ్జనార్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** సంక్రాంతి పండుగ సమీపిస్తోంది. పట్టణాలు, నగరాల్లో నివాసం ఉంటున్న వారు స్వగ్రామాలకు పయనం అవుతున్నారు. అలాంటి వారికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. పండుగకు ఇళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని సజ్జనార్ సూచించారు. సంక్రాంతి సంబరం విషాదం కాకూడదని ఆయన పేర్కొన్నారు. పండుగ నాడు పల్లెకు చేరాలన్న ఆత్రుత, ప్రాణాల మీదకు తేకుండా చూసుకోవాలన్నారు. పొగమంచులో సొంత వాహనాల్లో ప్రయాణం చేయకపోవడం మేలని పేర్కొన్నారు. తెల్లవారుజామున, అర్ధ రాత్రి వేళల్లో సాహసం చేయొద్దన్నారు. పొగమంచు పూర్తిగా తగ్గి, రోడ్డు స్పష్టంగా కనిపించిన తర్వాతే ప్రయాణాన్ని ప్రారంభించాలని కోరారు.

## తెలంగాణ డీజీపీకి హైకోర్టులో ఊరట

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హైకోర్టులో ఊరట లభించింది. ఆయన నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. డీజీపీ శివధర్‌రెడ్డి నియామక ఉత్తర్వులను కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పూర్తిస్థాయి డీజీపీ నియామక ప్రక్రియను 4 వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించింది.

## డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు ఊరట



**అక్షరటుడే, సినిమా డెస్క్:** డ్రగ్స్ కేసులో టాలీవుడ్ నటుడు నవదీప్‌కు హైకోర్టులో ఊరట లభించింది. గతంలో నమోదైన డ్రగ్స్ కేసును హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. నవదీప్ వద్ద డ్రగ్స్ దొరకలేదని న్యాయవాది సిద్ధార్థ్ వాదించారు. ప్రస్తుతం నాంపల్లి కోర్టులో విచారణ దశలో కేసు ఉంది. ఈ నేపథ్యంలో కేసును కొట్టి వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది.



# రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా ప్రభుత్వ తీరు

**రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశం అయ్యారు. యూనివర్సిటీకి చెందిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే కుట్ర చేస్తోందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌కు తలమానికంగా ఉన్న ఉర్దూ యూనివర్సిటీని కాంగ్రెస్ నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ అవసరాల కోసం వాడాలనుకుంటుంటోందని ఆరోపించారు.**

■ యూనివర్సిటీ భూముల ఆక్రమణకు కుట్ర ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ■ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులతో సమావేశం

అన్ని యూనివర్సిటీ భూములను గుంజుకోవడం ఒక ప్రక్రియగా కాంగ్రెస్ పెట్టుకుందన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ భూమిని హైకోర్టు పేరు చెప్పి తీసుకుందన్నారు. 400ఎకరాల సెంట్రల్ యూనివర్సిటీ భూమిని గుంజుకునే ప్రయత్నం చేయగా.. కోర్టులు అడ్డుకున్నాయని తెలిపారు. ఇప్పుడు ఉర్దూ యూనివర్సిటీ భూములపై కన్ను వేసిందన్నారు. ఈ ప్రభుత్వం విద్యా సంస్థల భూములను తీసుకుని రియల్ ఎస్టేట్ బ్రోకర్ మాదిరిగా వ్యవహరిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు.

### నోటిఫికేషన్లు వేయాలి

నిరుద్యోగులపై జరిగిన లాఠీఛార్జ్‌ను కేటీఆర్ ఖండించారు. నోటిఫికేషన్లు ఏవి అని నిలదీసినందుకు వారిని దారుణంగా తిడుతూ ఘోరంగా లాఠీ ఛార్జ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు మోసం చేస్తోందన్నారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఈ అంశంపై స్పందించి ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.

## ప్రశ్నాపత్రాల లీక్.. ప్రభుత్వంపై హరీశ్‌రావు విమర్శలు



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారంపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగానితనం, అసమర్థత, అవినీతికి ఈ ఘటన నిదర్శనమన్నారు. పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం మరువకముందే, ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ఏఐ పెన్‌లతో రాసిన మోడరన్ స్కాం రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తోందన్నారు. బహిరంగంగా, అక్రమంగా పరీక్షలు జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే, ప్రభుత్వం మొద్దు నిద్రలో మునిగి ఉందని విమర్శించారు.

## నేటి నుంచే డబ్ల్యూపీఎల్ ఆరంభం

**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** మహిళల ప్రిమియర్ లీగ్ నాలుగో సీజన్ నేటి నుంచి ఆరంభమవుతోంది. తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్.. స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనున్నాయి. జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు సాగనున్న ఈ టోర్నమెంట్‌లో ఐదు జట్లు టైటిల్ కోసం పోటీ పడనున్నాయి. ఫైనల్ మ్యాచ్ ఫిబ్రవరి 5న జరగనుంది. ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్ జట్లు బరిలోకి దిగుతున్నాయి.

## తిరుపతి మెట్ల మార్గంలో చిరుత కలకలం




**అక్షరటుడే, తిరుపతి :** తిరుపతిలో మరోసారి చిరుత సంచారం కలకలం రేపింది. శ్రీవారి మెట్ల మార్గంలో శుక్రవారం ఉదయం చిరుత ప్రత్యక్షం కావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు. శ్రీవారి 450వ మెట్టు మార్గంలో చిరుత కనిపించింది. దానిని చూసిన భక్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అనంతరం అది అడవిలోకి వెళ్లిపోయింది. భక్తులు ఈ విషయాన్ని టీటీడీ అధికారులకు సమాచారం అందించారు. టీటీడీ, అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పెద్ద శబ్ధాలు చేస్తూ చిరుతను అడవిలోకి తరిమే ప్రయత్నం చేశారు.

## అధ్యాపకుల వేధింపులకు ఇంటర్ విద్యార్థిని మృతి

**అక్షరటుడే, హైదరాబాద్ :** చదువు చెప్పాల్సిన టీచర్లు హేళనగా మాట్లాడారు. దీంతో ఓ విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన విద్యార్థిని ఎంఆర్ బాలికల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫస్టియర్ చదువుతోంది. గురువారం కాలేజీకి ఆలస్యంగా వెళ్లింది. దీంతో లెక్చరర్లు శ్రీలక్ష్మి, మధురిమ ఆమెను ఎందుకు ఆలస్యంగా వచ్చావని అడిగినట్లు తెలిసింది. క్రమశిక్షణ పేరుతో హేళనగా మాట్లాడినట్లు సమాచారం. పీరియడ్స్ వచ్చాయని, అందుకే ఆలస్యం అయిందని సదరు విద్యార్థి చెప్పగా.. అధ్యాపకులు అవమానించారు. ''పీరియడ్స్ వచ్చాయా.. నాటకాలు ఆడుతున్నావ''అంటూ తోటి విద్యార్థుల ముందు క్రూరంగా మాట్లాడారు. దీంతో విద్యార్థి ఇంటికి వెళ్లాక కుప్పకూలింది. ఆస్పత్రికి తీసుకువెళ్లగా.. గురువారం రాత్రి చనిపోయింది. మనస్తాపంతో బ్రెయిన్‌లో రక్తం గడ్డకట్టి చనిపోయినట్లు వైద్యులు తెలిపారు.

## వణికిస్తున్న చలి.. మరో 36 గంటలు జాగ్రత్త



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత కొనసాగుతోంది. నాలుగు రోజులుగా శీతల గాలులు తీవ్రంగా వీస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి 5 వరకు చలి ప్రభావం తక్కువగా ఉంది. పొగమంచు మాత్రం కురిసింది. అయితే నాలుగు రోజులుగా చలి మళ్లీ పంజా విసురుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోయాయి. పలు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ టెంపరేచర్ నమోదవుతోంది. ఉదయం 10 గంటల వరకు చలి పెడుతోంది. సాయంత్రం 5 గంటలు దాటితే బయటకు వెళ్లలేని పరిస్థితి. మధ్యాహ్నం సైతం చలిగాలులు వీస్తుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయితే మరో 36 గంటల పాటు రాష్ట్రవ్యాప్తంగా చలితీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

## టీజర్‌తో పిచ్చెక్కించిన సమంత..

**ఇప్పటి వరకు వెబ్ సిరీస్‌ల ద్వారా గ్లోబల్ రీచ్ సాధించిన సమంత, ఇప్పుడు మరోసారి పర్‌ఫుల్ థియెట్రికల్ ప్రాజెక్ట్‌తో టాలీవుడ్‌లో గ్రాండ్ రీ ఎంట్రీ ఇవ్వబోతుందని మా ఇంటి బంగారం టీజర్‌తో అర్థం అవుతోంది. సమంత వెబ్ సిరీస్‌లు, పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ల ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. 'ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి వెబ్ సిరీస్‌లతో బాలీవుడ్, ఓటీటీ మార్కెట్‌లో తన స్థాయిని చాటిన సమంత, ప్రస్తుతం ఫుల్‌ఫ్లెడ్ థియేట్రికల్ సినిమాతో మళ్లీ టాలీవుడ్‌లో రీ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో సమంత నటిస్తున్న క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'మా ఇంటి బంగారం' టీజర్ శుక్రవారం విడుదలైంది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**




## చైనా మాంజాతో బాలుడికి తీవ్ర గాయాలు

**అక్షరటుడే, జగిత్యాల:** సంక్రాంతి పండుగ సమీపిస్తుండడంతో ఆకాశంలో పతంగుల సందడి కొనసాగుతోంది. గాలిపటాలు ఎగరసే సమయంలో కొందరు చైనా మాంజా వినియోగిస్తున్నారు. ప్రభుత్వం దీనిని నిషేధించిన అక్రమంగా అమ్మకాలు సాగుతున్నాయి. ఈ మాంజాతో పక్షులు, మనుషుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. తాజాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో చైనా మాంజా మెడకు చుట్టుకుని బాలుడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఇంటిముందు ఆడుకుంటున్న శ్రీహాస్ మెడకు చైనా మాంజా చుట్టుకుంది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. మెడ భాగంలో తీవ్రంగా కోసుకుపోవడంతో నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. ప్రస్తుతం బాలుడు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీహాస్ మెడ చుట్టూ 20 కుట్లు వేసినట్లు తెలిసింది.